క్లుప్తంగా

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రతిభ చూపిన విద్యార్థులతో జేవీవీ నాయకులు

రాయదుర్గంటౌన్: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై మక్కువ, అభిరుచి, ఆసక్తితో ప్రతి ఒక్కరూ శాస్త్రవేత్తగా ఎదగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష జరిగింది. డాక్టర్ గేయానంద్ ఉదయం ప్రశ్న పత్రాలను విడుదల చేసి, పరీక్షలను ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వీరిలో ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక



ఎంపికైన టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నవ్యంధ్రా టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చమ్మా అన్వర్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ (సచిన్), కార్యదర్శిగా అబ్దుల్లా, కోశాధికారిగా ఉస్మాన్‌తోపాటు 10 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చమ్మా అన్వర్ మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 113 మంది టూవీలర్ మెకానిక్‌ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు చెప్పారు.

సంబరం..అపూర్వ సమ్మేళనం



42 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

కణేకల్లు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982–83 బ్యాచ్ విద్యార్థులు స్థానిక బిస్మిల్లా ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయం, ఇతర వృత్తుల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా సమ్మేళనానికి హాజరై, సరదాగా గడిపారు. తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. అప్పట్లో గైర్హాజరైన వాళ్లు ఈ సారి హాజరయ్యారు. చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వైస్ సర్పంచు పెద్దదేవర నబీషా, టీచర్ జాఫర్, వెంకటేశరెడ్డి, లారీ వెంకటేశులు, రాజారెడ్డి, శ్రీనివాసులు, టీకే సర్మస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: విట్లంపల్లికి చెందిన ఎర్రిస్వామి (61) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన... పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం నొప్పి తీవ్రత భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎర్రిస్వామికి భార్య వన్నమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

భార్య తరుచూ పుట్టింటికి వెళ్తోందని మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నుసి కొట్టాల తండాకు చెందిన కుమార్‌నాయక్, గీత భాను దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు. గీతాభాను తర చూ పుట్టింటికివెళ్తోందని కలహాలు మొదలయ్యాయి. శుక్రవారం కూడా దంపతులిద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన కుమార్‌నాయక్ పురుగుల మందు తాగాడు. కుమార్ నాయక్‌ను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆవరించిన తెగులు



తెగులు సోకిన వరి కంకులు . (ఇన్‌సెట్లో) తెల్లదోమ

వాతావరణంలో చోటుచేసుకుంటున్న అనేక మార్పుల ప్రభావం వరిపంటపై చూపుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఉన్నట్టుండి తీవ్రమైన ఎండలు.. ఆపై ఉక్కపోత.. అంతలోనే భారీ వర్షాలు .. ఇలాంటి కారణాలు వెరసి వచ్చని వరి పొలాలను కంకినల్లి, సుడిదోమ, అగ్గితెగులు లాంటి తెగుళ్లు ఆవరించాయి. దీంతో చేతికందివచ్చిన పంట.. ఇంటి వరకూ చేరుతుందా? అన్న కలవరపాటు అన్నదాతల్లో మొదలైంది.

రాయదుర్గం/బొమ్మనహాళ్/కణేకల్లు:

- అన్నదాతలకు ప్రతికూల వాతావరణం
- కంకినల్లి, సుడిదోమ, అగ్గితెగుళ్లు వ్యాప్తి
- అధిక ఖర్చులతో రైతన్నల అవస్థలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఖరీఫ్ సీజన్‌లో హెచ్ఎల్‌సీ ఆయకట్టుతోపాటు వ్యవసాయ బోరుబావుల కింద 14,622 హెక్టార్లలో వరి పంట సాగులోకి వచ్చింది. అన్ని ప్రాంతాల్లోనూ తెగుళ్లు, కీటకాలు, ఎలుకల బెడద రైతులను వెంటాడుతోంది. అధిక విస్తీర్ణంలో వరి పంట.. చిరుపొట్ట నుంచి గింజ పడే కీలకదశలో ఉంది. ముందస్తుగా సాగు చేసిన పంట కంకులు కట్టాయి. ఇలాంటి సమయంలో కంకినల్లి, సుడిదోమ, అగ్గితెగుళ్లు, ఎర్రతెగులు కాస్త అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వరుస తుఫాన్లతో తడి ఆరకపోవడం, చలిగాలుల తోపాటు కమ్ముకొస్తున్న పొగ మంచు లాంటి ప్రతికూల పరిస్థితులు దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. తెగుళ్లను అరికట్టేందుకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు చేస్తున్నారు.



పైరు రసం పీల్చుతున్న సుడిదోమ

జాగ్రత్తలతోనే నష్ట నివారణ..

గాలిలో తేమశాతంతో పాటు వేడి అధికంగా ఉంటోందని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ తెలిపారు. ఈ నేపథ్యంలో వరి చేలలో కంకినల్లి, సుడిదోమ, అగ్గి తెగుళ్లు విజృంభిస్తున్నాయి.



బొమ్మనహాళ్ వద్ద వరి చేలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతన్న

రైతులు అప్రమత్తంగా ఉంటూ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నష్ట నివారణ తగ్గించొచ్చు. వరి కంకులు పడిన మడిలో రెండు మీటర్ల దూరంలో దారి (పాయలు)లా ఏర్పాటు చేస్తే గాలి వీచి సుడిదోమ, కంకినల్లి తెగులు అదుపులో ఉంటుంది. 40–50 శాతం పొట్టదశలో ఉండే వరి పంటకు నీరు తగ్గించి ఆరు తడిగా మార్చుకోవాలి. సుడిదోమ నివారణ కోసం బ్యూక్రోఫిజన్ అనే పురుగు మందును ఎకరాకు 450 ఎంఎల్ పిచికారీ చేయాలి. అగ్గితెగుళ్ల నివారణకు బ్లాస్ట్ ట్రైసైక్లోజెల్ అనే పొడి మందును ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేయాలి. కంకినల్లి నివారణకు ప్రోఫికొనజోల్, స్పైరోమైజిన్ అనే పురుగు మందును ఎకరాకు 400ల మిల్లీలు పిచికారీ చేసుకోవాలి. రైతులు తప్పని సరిగా ఈ జాగ్రత్తలు పాటిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి సాధించొచ్చు.

ఖరీఫ్‌లో సాగైన వరి పంటల వివరాలు

నియోజకవర్గం	వరి పంట విస్తీర్ణం (హెక్టార్లలో)
రాయదుర్గం	10,492
కళ్యాణదుర్గం	3,120
ఉరవకొండ	1,010
మొత్తం	14,622

తెగుళ్లతో అధిక ఖర్చు



హెచ్ఎల్‌సీ ఆయకట్టులో రూ.1.40 లక్షలు ఖర్చుచేసి నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. పంట పొట్టదశకు చేరింది. కొంత భాగం వెన్నుకక్కింది. ఈ పరిస్థితుల్లో పంటను సుడిదోమ, అగ్గితెగుళ్లు ఆశించాయి. వాటి నివారణ కోసం ఖరీదైన పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. పెట్టుబడి రూపంలో మరింత భారమవుతోంది.

– అంజిరెడ్డి, రైతు, నాగలాపురం, డి హీరేహాళ్ మండలం

ముసురు ముంచేసింది



వరి పంట పొట్టదశ దాటి కంకి కట్టే సమయాన తుఫాను ప్రభావంతో ముసురు ముంచేసింది. వారం పది రోజులు ఎండ కాయకపోవడంతో పలు రకాల తెగుళ్ల పుట్టుకొచ్చాయి. వాటిని అదుపు చేసేందుకు మార్కెట్లో లభించే అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దిగుబడులు కోల్పోకుండా అధికారులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి.

– తిప్పేస్వామి, రైతు, కొలగానహళ్లి, బొమ్మనహాళ్ మండలం

మందులు కొట్టినా ఫలితంలేదు



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. రూ.1.20 లక్ష పెట్టుబడి పెట్టా. దోమ పోటు, అగ్గితెగుళ్ల, మెడ విరుపు తెగుళ్ల ఆశించకుండా ముందస్తుగా వివిధ రకాల మందులను పిచికారీ చేశా. అయితే అక్కడక్కడ దోమపోటు తెగుళ్ల ఆశించాయి. ఎన్నో ఆశలతో వరి పంట సాగు చేస్తే వాతావరణంలో మార్పులతో తెగుళ్ల పంటకు ఆశిస్తున్నాయి. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. – నాగభూషణ, కణేకల్లు

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని శ్రీనివాస కళ్యాణ మంటపంలో కంబాలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి కుమార్తె సుమతి, రాజశేఖర్‌రెడ్డి వివాహ వేడుక ఆదివారం జరిగింది. ఈ వేడుకలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, జెడ్పీటీసీ మంజునాథ్, మాజీ ఎంపీపీ సోమనాథ్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, ములుకునూరు గోవింద్, కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, దేవన్న, బోరంపల్లి రామిరెడ్డి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, ఎంఎస్ రాజు, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎల్ఐసీ ఉద్యోగి మృతి



షేక్ షానవాజ్ (ఫైల్)

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో రికార్డు క్లర్క్‌గా పని చేస్తున్న షేక్ షానవాజ్(48) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఈయన పదేళ్ల నుంచి రాయదుర్గంలో పని చేస్తున్నాడు. రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు షానవాజ్ మృతికి సంతాపం తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

అనుమతిలేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

బొమ్మనహాళ్: అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో అన్ని గ్రామాల్లో నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన వారు మాత్రమే దీపావళి సామగ్రి అమ్ముకునే అవకాశం ఉందన్నారు. అనుమతి లేకుండా విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని లిటిల్ రోజెస్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి యాజమాన్యం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేసింది. 50 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లికార్జున, కంబాల తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

2 వేల ఎకరాల్లో మొక్కల పెంపకం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి తదితర అటవీ భూముల్లో 2 వేల మొక్కలు పెంచుతున్నట్లు అటవీశాఖ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప తెలిపారు. ఆదివారం కళ్యాణదుర్గం అటవీశాఖ అధికారులతో పాటు స్థానిక సిబ్బంది జంబుగుంపల అటవీ ప్రాంతంలో పర్యటించారు. నందుంబీడు, దావానుపెంట, గవరమ్మపెంట తదితర ప్రాంతాల్లో నేరేడు, జాలి, టేకు, నీలగిరి తదితర మొక్కలను పెంచుతున్నట్లు వారు తెలిపారు.

అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్న లెనిన్‌బాబు

కుందుర్పి: మండలంలోని ఎస్కే చారిబుల్ ట్రస్ట్ చైర్మన్ లెనిన్‌బాబు ముగ్గురు అనాథ పిల్లలను అక్కున చేర్చుకున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన దంపతులు కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అనాథ పిల్లలు శ్రేయత, యామిని, భువనేశ్వరి తదితరులను చేరదీశారు. తన విలువల బడిలో విద్యతోపాటు వారికి అన్నివిధాలుగా ఆదుకుంటామని లెనిన్‌బాబు చెప్పారు.

నేడు పురపాలక సంఘ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 28న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారీగా అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు కణేకల్లు మండల సమావేశం

కణేకల్లు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరగనున్నట్లు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

శెట్టూరు: మండలంలోని ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



పూజలు చేస్తున్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



కూడేరు: రథంలో వాల్మీకి మహర్షి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట వాల్మీకి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, రక్షాంధనం, పంచగవ్యం, మండప పూజ, యంత్రాభిషేకం, జలధివాసం, పూజలు చేశారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ తలారి రంగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ శ్రీరాముడి చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి అన్ని యుగాల్లో పూజనీయుడని తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

కూడేరులో వాల్మీకి జయంతి

కూడేరు: మండల కేంద్రంలోని విఘ్నేశ్వర కాలనీలో ఉన్న వాల్మీకి ఆలయంలో వాల్మీకి జయంతి వేడుకలు జరిపారు. వాల్మీకి ఆలయాన్ని వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వాల్మీకి మహర్షి చిత్ర పటానికి వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం వాల్మీకి చిత్ర పటాన్ని రథంలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

ఉరవకొండ/ విడపనకల్లు: విడపనకల్లు మండలం కొట్టాలపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. విడపనకల్లు నుంచి ఉరవకొండ సమీపంలో ఉన్న మిరప పంటకు మందు పిచికారీ చేసేందుకు ద్విచక్రవాహనంపై జయరాం, శివమ్మ దంపతులు బయల్దేరారు. ఎదురుగా వస్తున్న కారు వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

బొమ్మనహాళ్: మండలంలోని గంగవరంలో 24 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ రామదాసు ఆదివారం తెలిపారు. అంకే నారాయణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

శతవసంత పథ సంచలన్ విజయవంతం



పథ సంచలన్‌లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సేవకులు

రాయదుర్గంటౌన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం శతవసంత పథ సంచలన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద నుంచి కణేకల్లు రోడ్డు, లక్ష్మీ బజార్, పాత బస్టాండ్ ఏరియా, వినాయక సర్కిల్, ఓబుళాచారిరోడ్డు మీదుగా ఆర్ఎస్ఎస్ సేవల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అతిథులు క్షేత్ర బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీధర్‌స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్‌లు మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ సంఘం 99 ఏళ్లు పూర్తి చేసుకుని శతవసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆర్ఎస్ఎస్ శాఖల ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

ఉరగాద్రి బాలోత్సవ పోటీలు ప్రారంభం



కాగితాలతో బొమ్మలు తయారు చేస్తున్న పిల్లలు



బొమ్మలు తయారు చేసిన జూనియర్ విద్యార్థినులు

ఉరవకొండ: నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరగాద్రి బాలోత్సవ పోటీలను ఆదివారం ప్రారంభించారు. నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్ తాడికొండ, ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిరుపతయ్య మాట్లాడారు. 4,5,6 తరగతుల విద్యార్థులు జూనియర్స్ విభాగంలో, 7,8,9 తరగతుల విద్యార్థులు సీనియర్స్ విభాగంలో పోటీపడుతారన్నారు. నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, శ్రీదేవి, శైలజ, నిర్మల, భాగ్య, సుజాత, వేణుగోపాల్, తరుణ్ బాషా హాజరయ్యారు.

ప్రతిబింబాలకు ప్రాణం పోశారు!



చదువుపై ఇష్టముంటే ఉన్నత స్థాయికి ఎదగొచ్చు.. కళకు సంకల్పం ఉంటే రాణించొచ్చు.. రాయదుర్గం పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులకు గురువులేరు.. స్వతహాగా కళను ఒంటపట్టించుకున్నారు. చిత్రలేఖనంపై మక్కువ పెంచుకున్నారు. మదిలో మెదిలే భావాలు, ప్రకృతి అందాలకు కళారూపాలు అద్దుతున్నారు. పండుగలు, సంప్రదాయాలు, చారిత్రక కట్టడాలు, సందేశాత్మక చిత్రాలు ఇలా ఎన్నో చిత్రాలకు జీవం పోస్తున్నారు. దేవుళ్లు, రాజకీయ నేతలు, సినీప్రముఖులు ఎవరి ప్రతిబింబమైనా సరే.. ప్రాణం పోస్తున్నారు. చేయి తిరిగిన చిత్రకారులకు మాత్రం తీసిపోకుండా పెన్సిల్, పెన్ను, కలర్స్‌తో డ్రాయింగ్, పెయింటింగ్‌లో ప్రావీణ్యం సాధిస్తున్నారు.

– రాయదుర్గంటౌన్ :


- చిత్రలేఖనంలో చిచ్చరపిడుగులు
- అబ్బుర పరిచే చిత్రాలతో 'దుర్గం' విద్యార్థుల ప్రతిభ
- చేయి తిరిగిన ఏకలవ్య కళతో ఆకట్టుకుంటున్న వైనం



కలెక్టర్ వినోద్‌కుమార్‌తో ప్రశంసలందుకున్న నవ్యశ్రీయాదవ్

చిత్రలేఖనంలో ఘటికుడు ఘట్కారి..





పట్టణంలోని ఘట్కారి సాయిప్రసాద్, శైలజ దంపతుల కుమారుడు ఘట్కారి కృష్ణమహేష్. ఆరోతరగతి నుంచే స్వతహాగా చిత్రలేఖనంలో ప్రావీణ్యం సంపాదిస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, తాతను స్ఫూర్తిగా తీసుకొని ఎన్నో అబ్బురపరిచే చిత్రాలను గీసి ప్రశంసలు అందుకున్నాడు. స్థానికంగా టెన్త్, ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం కృష్ణమహేష్ బెంగళూరులోని రెసిడెన్సీ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వందలాది అద్భుత చిత్రాలతో డ్రాయింగ్, పెయింటింగ్‌లో రాణిస్తున్నాడు. భవిష్యతులో మంచి చిత్రకారుడిగా ఎదగాలని కృష్ణమహేష్ ఆకాంక్ష. రాయదుర్గంలోని చారిత్రక కట్టడాలపై విలువైన సమాచారం సేకరించి, తన చిత్ర జ్ఞానాన్ని దాదాపు ఆరు నెలల నుంచి చిత్రరూపంలో మలుచుతున్నాడు. ఇటీవల పట్టణంలోని రాణీఛత్రం పాతబస్టాండ్‌కు వెళ్లే మార్గం, స్వాగత ద్వారాన్ని కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రం దుర్గంవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

అచ్చు గుద్దినట్టుంది.. గిద్దలూరు చిత్రకళ..





రాయదుర్గం పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయంలో కాంట్రాక్ట్ అటెండర్‌గా పని చేస్తున్న గిద్దలూరు మురళి, లక్ష్మీ దంపతుల కుమార్తె గిద్దలూరు నందిని. ప్రస్తుతం నందిని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఎవరి సహకారం లేకుండా తల్లిదండ్రుల స్ఫూర్తితో పదో తరగతి నుంచే చిత్రలేఖనంపై నందినికి ఆసక్తి ఉంది. అప్పటి నుంచి చిత్రలేఖనంలో ఆమె ప్రతిభ చూపుతోంది. ఇప్పటి దాకా వందల సంఖ్యలో చిత్రాలు గీసి శభాష్ అనిపించుకుంది. దేవుళ్ల బొమ్మలు, కార్టూన్లు, పక్షులు, జంతువులు, ప్రకృతికి సంబంధించి గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెయింటింగ్‌లో మరింత రాణించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరుతోంది.

పెన్సిల్‌తో 'నవ్య'మైన కళ..



రాయదుర్గం పట్టణంలోని డి.నరసింహులు, వెంకటేశ్వరి దంపతుల కుమార్తె డి.నవ్యశ్రీ యాదవ్ పెన్సిల్ ఆర్ట్‌లో రాణిస్తోంది. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నవ్యశ్రీ..నాలుగో తరగతి నుంచే చిట్టిచేతులతో చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకుంది. తనకున్న ఆసక్తితోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడైంది. ఇంతింతై.. అన్నట్లు.. ఎదిగేకొద్దీ కళపై పట్టుసాధించింది. ఏరూపాన్ని అయినా అప్పు రూపంగా గీస్తోంది. పెన్సిల్‌తో బొమ్మను ఇట్టే గీసే సత్తా సాధించింది. మనిషి రూపాన్ని కాకుండా ఫొటో ఉంటే చాలు.. అచ్చం అలాగే అద్భుతంగా గీస్తోంది. దేవుళ్ల బొమ్మలు, జంతువులు, ప్రకృతి బొమ్మలు ఎంతో చక్కగా గీస్తోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చిత్రాన్ని ఎంతో అద్భుతంగా గీసింది. నవ్యశ్రీని జిల్లా కలెక్టర్ పిలిపించుకుని పెన్సిల్ ఆర్ట్‌లో రాణిస్తున్న నవ్యశ్రీ ప్రతిభను ప్రశంసించడం విశేషం.